రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:29 (గురువారం సాయంత్రం)
సహర్: 4:56 (శుక్రవారం ఉదయం)



కక్షిదారులు లేక బోసిపోయిన చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

స్టాంపుల కొరత... రిజిస్ట్రేషన్లకు కలత

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరతతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.ఆరు నెలలుగా స్టాంపుల కొరత వేధిస్తోంది. రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100కు సంబంధించిన స్టాంపులను బ్యాంకుల్లో రుణాలు తీసుకునేందుకు వినియోగదారులు ఉపయోగిస్తారు. బ్యాంకులో ష్యూరిటీతో పాటు నకళ్ల దరఖాస్తుకు వినియోగిస్తారు. రిజిస్ట్రేషన్, అగ్రిమెంటు, శాశ్వత విక్రయాలు, దాన పత్రాలు, క్రయవిక్రయాలు.. లాంటి లావాదేవీలకు స్టాంపులు అవసరం. అఫిడవిట్లకోసం రూ.10, రూ.20 స్టాంపులు కావాలన్నా దొరకడం లేదు. కుల ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. స్టాంపులు లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడడంతో పాటు క్రయవిక్రయదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరునెలల క్రితం స్టాంపులు పూర్తిగా లేకపోవడంతో స్థానిక వెండర్ల వద్దకు వెళ్లి రెట్టింపు ధర ఇచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దళారులు అదనపు వసూళ్లకు పాల్పడుతూ వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు.ఈ కారణంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురౌతున్నారు. ఈ-స్టాంపింగ్ విధానాన్ని అదుపు చేసేందుకోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక నాన్-జ్యుడీషియల్ స్టాంపులు సరఫరా చేసింది. అయితే ఆన్‌లైన్ సమస్య వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. రోజూ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం కోసం క్రయ విక్రయదారులు కార్యాలయం చుట్టూ తిరిగి,స్టాంపులు దొరక్క వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.కొన్నిచోట్ల వెండర్ల నుంచి అధిక మొత్తాలకు స్టాంపులు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ల కోసం వస్తే ఆన్‌లైన్‌లో చలానా తీసుకోవడం లేదు. దీని వల్ల రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయి.

ప్రభుత్వానికి నివేదించాం

నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. రూ.100 విలువ కలిగిన స్టాంపులు చిత్తూరుకు చేరాయి. వాటిని త్వరలో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిస్తాం. గతంలో వెండర్లకు అందించిన స్టాంపుల క్రయవిక్రయాలపై ప్రభుత్వం నివేదిక కోరింది. త్వరలో నివేదిక పంపించేందుకు ఏర్పాట్లు చేపట్టాం. త్వరలో స్టాంపుల కొరత తీరనుంది. స్టాంపుల కొరత లేకుండా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నాం.



- వెంకటరమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు.

సబ్సిడీ రుణాలకు తీవ్ర పోటీ



బీసీల్లో 2020 యూనిట్లకు ఏకంగా 18,168 దరఖాస్తులు

వైశ్యులకు 16 యూనిట్లకు గాను 1,764 దరఖాస్తులు

చిత్తూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ రుణాలకు తీవ్ర పోటీ నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా పేద, నిరుద్యోగ యువతను గాలికొదిలేయడంతో ఎప్పుడూ లేనంతగా వివిధ కులాల లబ్ధిదారులు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014 - 19 సంవత్సరాల మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, కమ్మ, కాపు, తదితర కులాల కార్పొరేషన్లకు పెద్దఎత్తున సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది.ఏటా అన్ని కార్పొరేషన్లకు కలిపి 25వేల మందికి రుణాలను మంజూరు చేసేది. ఒక్కో లబ్ధిదారుడికి యూనిట్‌ను బట్టి 30 నుంచి 50 శాతం వరకు సబ్సిడీ లభించేది. దాంతో ఆయా రంగాల్లో అనుభవమున్న వారు టిఫిన్ సెంటర్ నుంచి టీ దుకాణం వరకు, ఆటో నుంచి ఇన్నోవా కార్ల వరకు, ఇంట్లో చీరల వ్యాపారం నుంచి వస్త్ర దుకాణం వరకు పెట్టుకుని ఆర్థికంగా ఎదిగారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది.టీడీపీ హయాంలో ఇచ్చిన రుణాలను రికవరీ చేసి ప్రతి నెలా జీతాలను తీసుకునే పరిస్థితికి తీసుకొచ్చింది. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడంతో కార్పొరేషన్ల అధికారులు ఐదేళ్లపాటు ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.

● ఈసారి వెల్లువెత్తిన దరఖాస్తులు

వైసీపీ పాలనలో పూర్తిగా నష్టపోయిన వర్గాలను ఆదుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బీసీలు, ఈబీసీలు, కాపు, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలను ప్రాధాన్యతగా తీసుకుంది. దీంతో సబ్సిడీ రుణాల కోసం ఎప్పుడూ లేనంత సంఖ్యలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. 2,020 యూనిట్లను బీసీలకు కేటాయించగా 18,168 మంది దరఖాస్తు చేసుకున్నారు. వైశ్యులకు 16 యూనిట్లను కేటాయించగా 1,764 మంది, కమ్మ కులస్థులకు 84 యూనిట్లను కేటాయించగా 440 మంది, ఈబీసీ కులస్థులకు 103 యూనిట్లను కేటాయించగా 384 మంది, రెడ్డి కులస్థులకు 75 యూనిట్లను కేటాయించగా 363 మంది దరఖాస్తు చేసుకున్నారు.కాపులకు 445 యూనిట్లను కేటాయించగా 120 మందే దరఖాస్తు చేసుకోవడం విశేషం.

అధికారులకు, బ్యాంకర్లకు పరీక్ష

ఎన్నడూ లేనివిధంగా సబ్సిడీ రుణాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఎంపిక విషయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మామూలుగా అయితే పేదవారుగా ఉండి.. బ్యాంకుల్లో ఎంతో కొంత ఆర్థిక లావాదేవీలు జరిపిన వారికి అవకాశం ఇస్తారు. ఇంటర్వ్యూలో ఓ లబ్ధిదారుడికి రుణమివ్వాలని అధికారి నిర్ణయించినా బ్యాంకు అధికారులు ఫైనల్ చేయాల్సి ఉంది. సబ్సిడీ పోనూ మిగిలిన మొత్తాల్ని వాయిదాల పద్ధతిలో క్రమం తప్పకుండా చెల్లిస్తాడా లేదా అని బ్యాంకు అధికారులు అంచనా వేస్తారు. కార్పొరేషన్ అధికారులు చెప్పిన వారికి రుణాలిస్తే... బ్యాంకులకు కట్టాల్సిన డబ్బులను ఎవరు కడతారన్నది వారి ప్రశ్న. దానికితోడు జిల్లా అంతటా ఇంటర్వ్యూలు జరిగిన రోజుల్లో ఆయా మండల, నియోజకవర్గాల నేతలు వారికి కావాల్సిన వారి పేర్లను ఎంపీడీవోలకు, కమిషనర్లకు సిఫార్సు చేశారు. అలా చేయని ప్రజా ప్రతినిధులు కూడా వారికి కావాల్సిన లబ్ధిదారుల పేర్లను జాబితాల రూపంలో అధికారులకు ఇస్తున్నారు. సబ్సిడీ రుణాల మంజూరులో ప్రజా ప్రతినిధుల మాట చెల్లుతుందా లేదా కార్పొరేషన్ అధికారులు, బ్యాంకర్ల మాటలు చెల్లుతుందా చూడాల్సివుంది.

మున్సిపాలిటీల్లో పన్ను బకాయిలు రూ. 9.66 కోట్లు

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మున్సిపాలిటీలు, చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో వున్న ప్రభుత్వ రంగ సంస్థలు చెల్లించవలసిన పన్ను బకాయిలు 9.66 కోట్లకు చేరాయి. మరో రెండు వారాల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా పూర్తికానున్న నేపథ్యంలో ఈ బకాయిలు పన్ను వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలో గరిష్ఠంగా పీఆర్ కార్యాలయం రూ. 7 లక్షలు పన్ను బకాయి పడగా, ప్రభుత్వ ఆస్పత్రి రూ. 6.39 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ. 17.18 లక్షలు, ఎస్టీవో కార్యాలయం రూ. 5.28 లక్షలు, ఎంఆర్సీ రూ. 1.90 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ రూ. 2.04 లక్షలు , పోలీసు స్టేషన్ రూ. 6.05 లక్షలు.... ఇలా దాదాపు 43 లక్షల మేర బకాయిలు పేరుకు పోయాయి. ఇక పుంగనూరు మున్సిపాలిటీలో రూ. 55 లక్షలు, నగరి మున్సిపాలిటీలో రూ. 21 లక్షలు,కుప్పం మున్సిపాలిటీలో రూ. 20 లక్షలు, చిత్తూరు కార్పొరేషన్‌లో .8.28 కోట్లు వసూలు కావాల్సి వుంది. పలమనేరు మున్సిపాలిటీలో రూ.7లక్షలు, పుంగనూరులో రూ. 12 లక్షలు, నగరిలో రూ. 4లక్షలు, కుప్పంలో రూ. 3లక్షలు, చిత్తూరు కార్పొరేషన్‌లో రూ. 56 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. జిల్లావ్యాప్తంగా రూ. 9.66 కోట్లు వసూలు కావలసి వుండగా ఇప్పటి వరకు కేవలం రూ. 82 లక్షలు మాత్రమే వసూలయ్యాయి.

గేట్ ఫలితాల్లో చిత్తూరు విద్యార్థికి 13వ ర్యాంకు



జి.వర్షిత్

చిత్తూరు సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 2025 గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాల్లో చిత్తూరు విద్యార్థి జి.వర్షిత్‌కు జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు లభించింది. ఫిబ్రవరి 1,2,15,16 తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి.చిత్తూరులో టెన్త్ వరకు చదివిన వర్షిత్, ఇంటర్‌ను విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో పూర్తి చేశాడు. క్యాలికట్‌లోని ఎన్‌ఐటీలో ప్రస్తుతం ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది నిర్వహించిన గేట్ పరీక్షల్లో తొలి యత్నంలోనే జాతీయస్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు.

ఎస్వీయూ విద్యార్థినికి 78వ ర్యాంకు



బి.కీర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో ఎస్వీ యూనివర్సిటీ ఎమ్మెస్సీ ఫిజిక్స్ విద్యార్థిని బి.కీర్తి మెరిసింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈమె ఈ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 78వ ర్యాంకును కైవసం చేసుకుంది. తద్వారా జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసే అవకాశాన్ని పొందింది. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ ఓవీఎస్ రెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ఆమెను అభినందించారు.



చిత్తూరులో బోసిపోయిన ప్రకాశం హైరోడ్డు

పెరుగుతున్న ఎండలతో ప్రజలు విలవిల

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బుధవారం మండలాలవారీగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు... గుడిపాలలో 38.3డిగ్రీలు, గంగవరంలో 38.1, నగరిలో 38.1, నింద్రలో 37.9, శాంతిపురంలో 37.9, తవణంపల్లెలో 37.6, శ్రీరంగరాజపురంలో 37.3, గుడుపల్లెలో 37.2, పులిచెర్లలో 36.7, సదుంలో 36.3, పెద్దపంజాణిలో 36.2, వెదురుకుప్పంలో 36.2, వి.కోటలో 36.1, చౌడేపల్లెలో 35.9, ఐరాలలో 35.9, పాలసముద్రంలో 35.9, సోమలలో 35.9, విజయపురంలో 35.9, పెనుమూరులో 35.6, బంగారుపాళ్యంలో 35.3, రొంపిచెర్లలో 35.3, చిత్తూరులో 35.2, గంగాధరనెల్లూరులో 35.2, పూతలపట్టులో 34.7, రామకుప్పంలో 34.7, పలమనేరులో 34.6, యాదమరిలో 33.9, పుంగనూరులో 33.7, కార్వేటినగరంలో 33.6, కుప్పంలో 33.6, బైరెడ్డిపల్లెలో 33.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఎండవేడిమికి గొడుగు నీడన వెళ్తున్న మహిళలు

డ్వామాలో భారీగా బదిలీలు

చిత్తూరు సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో భారీగా బదిలీలు జరిగాయి. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి మేట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ వరకు మొత్తం 97మందిని బదిలీ చేశారు. బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో డీఆర్వో మోహన్‌కుమార్, డ్వామా పీడీ రవికుమార్ బదిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. పుంగనూరులో ఖాళీగా వున్న అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ స్థానానికి బి.బాలసుబ్రమణ్యాన్ని బదిలీ చేయగా, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ అధికారి ఖాళీ స్థానాల్లో ఎస్.బబితను బంగారుపాళ్యం, కె.జాహ్నవిని ఐరాల, జీ.కిరణ్‌కుమార్‌ను కార్వేటినగరం, ఎం.దినకరబాబును నగరి, సౌభాగ్యవతిని పులిచెర్ల, కె.ఇందును పూతలపట్టు, జి.షౌకత్ అలీని సోమల, ఎన్.మీనాకుమారిని వెదురుకుప్పం, ఎం.దానయ్యను విజయపురం, వి.సంధ్యరాణిని యాదమరికి బదిలీ చేశారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ విభాగంలో ఖాళీలుగా ఉన్న స్థానాలకు ఎస్.రఘునాథ్‌ను బైరెడ్డిపల్లె, బి.కిషోర్‌కుమార్‌ను బంగారుపాళ్యం, పి.జ్యోతిని ఐరాల, ఇ.మధుసూదన్‌ను పాలసముద్రం,ఆర్‌పి సుబ్రమణ్యాన్ని పెద్దపంజాణి, సీఆర్ రెడ్డప్పను పుంగనూరు, కె.గణేష్‌ను రామకుప్పం, కె.నాగమణిని సోమలకు బదిలీ చేశారు. వీరితో పాటు 42 టెక్నికల్ అసిస్టెంట్ , 35 కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు , ఓ మేట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ పోస్టుకు కౌన్సెలింగ్ జరిగింది.



డ్వామాలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

టీటీడీ నిధులతో 'తుడా'లో పారిశుధ్య పనులా?

● దీనిపై మీ వైఖరి ఏమిటో చెప్పండి ● రాష్ట్ర ప్రభుత్వానికి, టీటీడీకి, తుడాకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిధులను ధార్మిక కార్యక్రమాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించడాన్ని హైకోర్టు మరోసారి ఆక్షేపించింది. తమిళనాడు నుంచి భక్తులు వస్తున్నారనే పేరుతో ఆ రాష్ట్రం నుంచి తిరుమలకు రోడ్ల విస్తరణ, మరమ్మతులను టీటీడీ నిధులతో చేపడతారా అని ప్రశ్నించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ నిధులను తిరుపతి కార్పొరేషన్‌లోని రోడ్లు, కాలనీల పారిశుధ్య పనులకు వినియోగించడాన్ని అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై వైఖరి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీటీడీని, తుడాను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుపతి కార్పొరేషన్‌లోని రోడ్లు, కాలనీల పారిశుధ్య పనులకు ప్రతీ ఏడాది రూ.100 కోట్లు టీటీడీ నిధులను వినియోగించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత జి.భానుప్రకాశ్ రెడ్డి 2023లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం... ఈవో నిర్ణయం దేవదాయ చట్టానికి విరుద్ధమని ప్రకటించింది. టెండర్ ప్రక్రియను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది రేగులగడ్డ వెంకటేశ్ వాదనలు వినిపించారు. భక్తులు ఇచ్చే కానుకలను, నిధులను భక్తుల సంక్షేమం, హిందూ ధర్మం కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించడానికి వీల్లేదని పేర్కొన్నారు. టీటీడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంపై టీటీడీ కొత్త బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి స్పందిస్తూ.... తిరుపతి కార్పొరేషన్ పరిధిలో తిరుమలకు దారితీసే రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య పనుల నిర్వహణ కోసమే నిధులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం.. దీనిపై వైఖరి తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

నీవానది నుంచి ఇసుకెళ్లిపోతోంది!



నీవానదిలో డంప్ చేసిన ఇసుక వద్ద పోలీసులు

గంగాధరనెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నీవానది యేటి ప్రాంతం నుంచి రాత్రివేళల్లో అక్రమంగా ఇసుకను టిప్పర్లల్లో కొందరు తరలిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది.స్థానికుల ద్వారా మీడియాకు తెలిసి ఆ ప్రాంతంలోకి వెళ్లి పరిశీలిస్తే ఇసుక రవాణాకు పెద్ద తతంగమే నడుస్తున్నట్లు బయటపడింది.పోలీసులకు, రెవిన్యూ అధికారులకు సమాచారం అందిస్తే అప్పటికప్పుడు తడుముకుని ఆ రెండు శాఖలూ రంగంలోకి దిగి, యంత్రాలను సీజ్ చేస్తున్నట్లు ప్రకటించాయి.గంగాధరనెల్లూరు బ్రిడ్జికి దిగువన నీవానది యేటిప్రాంతంలో వారంరోజులుగా రాత్రివేళల్లో ఇసుకను తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు.యేటిప్రాంతంలో పెద్దఎత్తున ఇసుక కుప్ప ,ముళ్ళపొదల సమీపంలో రెండు ట్రాక్టర్లతో పాటు హిటాచీ యంత్రం వున్నాయి. ఆహారం తయారు చేసుకోవడానికి వంటపాత్రలు, వైర్‌మంచం, డీజల్ తెచ్చుకోవడానికి ప్లాస్టిక్ డ్రమ్ములు ఉన్నాయి. అక్కడే వున్న ఇద్దరు వ్యక్తులను విచారిస్తే తాము కూలీలుగా వచ్చామని, ఇసుక రవాణాదారులు ఎవరో తమకు తెలియదని చెప్పారు. మీడియా ప్రతినిధులు సమాచారం ఇస్తే ఆర్ఐ ఏకాంబరంతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్ ఇసుక డంప్ చేసిన చోటికి చేరుకున్నారు. అక్కడున్న ట్రాక్టర్లతో పాటు హిటాచీ యంత్రాన్ని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.ఇసుక రవాణాకు కారకులెవరనేది విచారించి రెండురోజుల్లో చెబుతామన్నారు.ఎక్కడో మారుమూల గ్రామంలో కాకుండా మండల కేంద్రంలోనే ఇసుక అక్రమరవాణాకు తెరతీశారంటే దీని వెనుక పెద్దవాళ్లే వుంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఇసుక డంప్ వద్ద ఉన్న ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న కానిస్టేబుల్

భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపారు?

తొక్కిసలాట సమయంలో మీరెక్కడ ఉన్నారు? ● టీటీడీ పూర్వ జేఈవో గౌతమిపై కమిషన్ ప్రశ్నల వర్షం

● న్యాయవాదులతో విచారణకు వచ్చిన పోలీసులు ● దాదాపు వంద మంది విచారణకు హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై టీటీడీ పూర్వ జేఈవో గౌతమిని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి సుదీర్ఘంగా విచారించారు. బుధవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ విచారణ సాగింది. 'వైకుంఠ ఏకాదశికి తిరుమలకు లక్షల్లో భక్తులు వస్తారు. టోకెన్ల కోసం పెద్దసంఖ్యలో వస్తారని తెలుసుకదా? మీరు తీసుకున్న యాక్షన్ ప్లాన్ ఏమిటి? టికెట్ల కేటాయింపునకు ప్రభుత్వ హైస్కూల్ కేటాయిస్తే.. భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపించారు? తొక్కిసలాట సమయంలో మీరెక్కడ ఉన్నారు? ఘటనా స్థలానికి ఎందుకు రాలేదు? పార్కు తాళాలు ఎవరు వేశారు?' ఇలా వివిధ అంశాలపై జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. 'పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తిరుమల, తిరుపతిలోని పరిపాలన భవనంలో భక్తులకు టోకెన్ల కేటాయింపు విషయంపై పలుమార్లు సమీక్ష నిర్వహించాం. యాక్షన్ ప్లాన్‌నూ సిద్ధం చేశాం. బైరాగిపట్టెడ పార్కు నా పరిధిలోకి రాదు. సంఘటన జరిగినప్పుడు నేను జీవకోనలోని టోకెన్ల కేంద్రంలో ఉన్నాను. ఘటన జరిగిన వెంటనే స్విమ్స్‌కు వెళ్లా' అని గౌతమి చెప్పినట్లు సమాచారం. దీంతోపాటు సుమారు 5 పేజీల వరకు ఆమె కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున న్యాయవాదులు కమిషన్ ఎదుట గౌతమిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. మరోవైపు తొక్కిసలాట ఘటనలో కీలకంగా మారిన 16మంది బాధితులను రెండోసారి విచారణకు పిలిచారు. ఓజిలికి చెందిన కృష్ణమ్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా రామసముద్రం మండలానికి చెందిన మరో ఇద్దరిని విచారించారు. పోలీసులు, టీటీడీ నిర్లక్ష్యంగా కారణంగా తాము తీవ్రంగా గాయపడ్డామని వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక, మధ్యాహ్నం తర్వాత నలుగురిని మాత్రమే విచారించారు. కాగా, తొక్కిసలాట సమయంలో విధుల్లో ఉన్న అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, సస్పెండైన డీఎస్పీ రమణకుమార్, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డితో పాటు డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు జనవరి 8న పద్మావతి పార్కు వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, టీటీడీ విజిలెన్స్ ఉద్యోగులు సుమారు 90మందిని కూడా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విచారణకు పిలిపించారు. సమయం లేకపోవడంతో గురువారం వీరంతా కమిషన్ ఎదుట హాజరు కానున్నారు. కాగా, విచారణ నేపథ్యంలో నాడు విధుల్లో ఉన్న టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, పలువురు డీఎస్పీలు, సీఐలు తమవెంట లాయర్లను తెచ్చుకున్నారు. కమిషన్ ఎదుట ఎలా వాంగ్మూలం ఇవ్వాలనే దానిపై వారితో చర్చిస్తూ కనిపించారు. తొక్కిసలాట ఘటనపై తిరుపతి కలెక్టరేట్ వేదికగా మరో మూడు రోజుల పాటు విచారణ సాగనుంది.




విచారణకు హాజరైన టీటీడీ పూర్వ జేఈవో గౌతమి.. నాటి ఎస్పీ సుబ్బరాయుడు, పూర్వ సీవీఎస్వో శ్రీధర్ - విచారణకు హాజరైన టీటీడీ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విజిలెన్స్ అధికారులు

రామకృష్ణ హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

పుంగనూరు రూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.నిందితుల్లో మహేశ్ భార్య రజని పుంగనూరు కోర్టులో లొంగిపోవడంతో న్యాయమూర్తి వంశీకృష్ణ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. అలాగే మహేశ్‌ను, త్రిలోకనాయుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి వంశీకృష్ణ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. వీరిని అన్నమయ్య జిల్లా మదనపల్లె కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

పెద్దిరెడ్డి ఆరాచకాలపై ఇప్పటికైనా చంద్రబాబు దృష్టి పెట్టాలి

బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్



రామకృష్ణ కుటుంబసభ్యులతో రామచంద్రయాదవ్

పుంగనూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇప్పుడు కూడా కట్టడి చేయకపోతే ఆయన చేసే అరాచకాలకు, మారణకాండకు అంతే వుండదని బీసీవై పార్టీ అధినేత బి. రామచంద్రయాదవ్ హెచ్చరించారు. పుంగనూరు మండలం కృష్ణాపురంలో ఇటీవల దారుణహత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబీకులను బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో వైసీపీ నాయకుల తప్పుడు కేసుల వల్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుటుంబాలను వదిలి బయట ప్రాంతాల్లో జీవించారని, ఇప్పుడు అధికారంలో ఉన్నా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని నిలదీశారు.కంటి తుడుపు చర్యగా పోలీసులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో భయాందోళన సృష్టించడానికే పెద్దిరెడ్డి ఇలాంటి దాడులు చేయిస్తున్నాడన్నారు.వేలాది ఎకరాల భూములను పెద్దిరెడ్డి ఆక్రమించుకున్నా చర్యలు తీసుకోలేదన్నారు. పెద్దిరెడ్డి ఆరాచకాలపై ఇప్పటికైనా చంద్రబాబు దృష్టి పెట్టాలని సూచించారు.

కాణిపాకంలో పార్కింగ్ ఫీజు వేలంతో రూ.2.12 కోట్ల ఆదాయం



పార్కింగ్ వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు, సర్పంచ్

ఐరాల(కాణిపాకం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): పార్కింగ్ ఫీజు వసూలు వేలం ద్వారా కాణిపాకం పంచాయతీ, వరసిద్ధుడి ఆలయానికి రూ.2.12 కోట్ల ఆదాయం లభించినట్లు సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కుసుమకుమారి తెలిపారు. బుధవారం కాణిపాకంలో పార్కింగ్ వేలాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీల్డ్ టెండర్లలో మొత్తం 9 మంది పాల్గొనగా, అందులో రెండు దరఖాస్తులు చెల్లనివి ఉన్నట్లు తెలిపారు. మిగిలిన ఏడు దరఖాస్తుల్లో రూ.2,12,00,000 మేరకు హెచ్చు పాటదారుడు దక్కించుకున్నట్లు చెప్పారు. బహిరంగ వేలం ద్వారా ఎవరూ పాల్గొనకపోవడంతో బహిరంగ వేలాన్ని నిలిపివేసినట్లు వివరించారు. హెచ్చు పాటదారుడు సంవత్సరం పాటు పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునే హక్కును కలిగి ఉంటాడని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కిషోర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు బుధవారం చెప్పారు. కాగా పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా : అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా- కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

23న తిరుపతిలో రాయలసీమ మాలల సింహగర్జన



మాట్లాడుతున్న మాల సంఘం నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తిరుపతిలో ఈ నెల 23వ తేదీన రాయలసీమ మాలల సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు మాల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ దళితుల ఐకమత్యం చూసి ఓర్వలేక మాల, మాదిగలను వేరుచేసేందుకు పాలకులు చేసే ప్రయత్నమే ఎస్సీ వర్గీకరణ అని అన్నారు. పాలకులకు కనువిప్పు కలిగేందుకు ఈనెల 23న తిరుపతి మున్సిపల్ గ్రౌండ్‌లో రాయలసీమ మాలల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్లను మాల జేఏసీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు దుగ్గాని జయరాం, కేవీ రాఘవులు, లక్ష్మీనారాయణ, కాణిపాకం ధనలక్ష్మి, మునస్వామి, దామోదరం, మోక్షజ్ఞేశ్వరరావు, రాబర్ట్, పార్థసారథి, చెంగల్రాయుడు, బుల్లెట్ బాబు, మురళి, శరవణ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు కేజీబీవీల్లో 7,8,9,10వ తరగతులు, ద్వితీయ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి బాలికల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అనాథలు, బడిబయటి పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీసీ వర్గాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ఇచ్చిన దరఖాస్తులు పరిగణలోకి తీసుకోనున్నట్లు ఏపీసీ తెలిపారు. ఇతర వివరాలు, సమస్యలు, సందేహాలకు 70751 59996, 70750 39990 నంబర్లో సంప్రదించాలన్నారు.

27న తాళ్లపల్లి ఉపసర్పంచ్ ఎన్నిక

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం తాళ్లపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ పదవికి ఈనెల 27న ఎన్నిక జరగనుంది. తాళ్లపల్లి ఉపసర్పంచ్ ఏడాది క్రితం మృతిచెందడంతో ఆ పదవికి ఖాళీ ఏర్పడింది. ఈనెల 27న ఉదయం ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల్లో పాల్గొనేందుకు సంబంధిత సభ్యులకు ఈనెల 23వ తేదీ నాటికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటీసులను అందజేస్తారు. ఒకవేళ 27వ తేదీన ఎన్నికల కోసం నిర్వహించే ప్రత్యేక సమావేశానికి కోరం లేకుంటే మరుసటి రోజైన 28వ తేదీన ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ జారీచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని డీపీవో సుధాకరరావు తెలిపారు.

భారీ వాహన సారథ్యానికీ సై..

● హెవీవెహికల్ డ్రైవింగ్‌లోనూ దూసుకెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థిని



శిక్షణలో భాగంగా ఆర్టీసీ బస్సును నడుపుతున్న అక్షిత

తిరుపతి (ఆర్టీసీ), మార్చి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనమో, కారో ఆడపిల్లలు నడపడం సాధారణం. కానీ లారీనో బస్సునో నడపడానికి ముందుకు రావడం అంటే ఆశ్చర్యమే. తాను ఆశించిన ఉద్యోగ సాధనకు ఇందుకు సిద్ధమంటోంది అక్షిత. ఇటీవల తిరుపతిలో హెవీ వెహికల్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ కూడా పొంది ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా ఆమెను పలకరిస్తే.. మాది తిరుపతిలోని సత్యనారాయణపురం శ్రీనగర్‌కాలనీ. మా నాన్న వెంకటప్రసాద్. అమ్మ హైమావతి నాకు మూడేళ్ల వయసులోనే చనిపోయింది. నేను రెండో సంతానం. అమ్మమ్మ శారదమ్మ సాకింది. నాన్న కొన్నాళ్లు ప్రయివేట్ వాహనాలను నడిపాడు. చాలీచాలని సంపాదన. అయినా చాలా కష్టపడి ఇంటిని నెట్టుకురావడం చూశాను. తర్వాత టూరిజంలో కాంట్రాక్టు డ్రైవర్‌గా అవకాశం లభించింది. నాన్న నిరంతర కష్టం నన్ను బాగా చదివేలా ప్రేరణ ఇచ్చింది. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులే వచ్చాయి. పద్మావతి మహిళా యూనివర్శిటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు లభించింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో డిగ్రీ ఒక్కటే సరిపోదు. ఏదో ఒక నైపుణ్యం తప్పనిసరి. ఆర్టీఏలో ఉద్యోగం పొందాలనేది నా అభిలాష. ఈ క్రమంలోనే అలిపిరిలోని ఆర్టీసీ హెవీడ్రైవింగ్ స్కూల్లో ఈమధ్య నెల రోజుల పాటు భారీ వాహనాలను నడపడంలో శిక్షణ పొందాను. తొలి రెండు రోజులు భయమేసినా తర్వాత ధైర్యం తెచ్చుకున్నాను. బస్‌కూడా నడిపాను. ఇక్కడ శిక్షణ పొందిన రెండో మహిళను నేనే. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా వెంటనే రావడం సంతోషాన్నిచ్చిందన్నారు అక్షిత.



డ్రైవింగ్ శిక్షకులతో అక్షిత



సహచరులతో అక్షిత



శిక్షణ పూర్తిచేసుకొని సర్టిఫికెట్ తీసుకుంటున్న అక్షిత, తండ్రి వెంకటప్రసాద్

మోసాలకు పాల్పడితే లైసెన్స్ రద్దు

ఆ పెట్రోల్ బంకులను ఏమాత్రం ఉపేక్షించొద్దు ● నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్నారు

● యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాల్సిందే ● ఇంధన కంపెనీలకు హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కిరోసిన్ కలపడం, ఇంధనం తక్కువ పోయడం వంటి చర్యలతో వినియోగదారులను మోసగిస్తున్న రిటైలర్లపై కఠినంగా వ్యవహరించాల్సిందేనని తేల్చిచెప్పింది.పెట్రోల్ తక్కువ ధరకేమీ ఇవ్వడం లేదని, ప్రతీ లీటర్‌కు రూ.100కుపైగా వసూలు చేస్తున్నారని గుర్తు చేసింది. వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతున్న పెట్రోల్ బంకు యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారని, వారిని ఏమాత్రం ఉపేక్షించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మోసాలకు పాల్పడుతూ పట్టుబడిన రిటైలర్ల లైసెన్స్‌లు వెంటనే రద్దు చేయాలని తేల్చిచెప్పింది.వైఎస్ఆర్‌కడప, తిరుపతి జిల్లాల్లో రెండు పెట్రోల్ బంకుల మోసాలకు సంబంధించి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవాలుచెప్పకుండా దాచిపెట్టడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అన్ని వివరాలతో సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కడప, అరవింద్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తేజ ఫిల్లింగ్ స్టేషన్, తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శెట్టిపల్లి వద్ద ఉన్న తేజ సర్వీస్ స్టేషన్ మోసాలకు పాల్పడుతున్నా హెచ్‌పీసీఎల్ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పేర్కొంటూ కడప జిల్లా ఖాజీపేట గ్రామానికి చెందిన వెంకట మహేశ్వర్‌రెడ్డి 2024లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది మేడపాటి సంతోష్‌రెడ్డి వాదనలు వినిపించారు. హెచ్‌పీసీఎల్ వేసిన కౌంటర్‌లో పెట్రోల్ బంకులపై ఉన్న ఆరోపణలు, వాటిపై ఉన్న కేసులు, తీసుకున్న చర్యల గురించి పూర్తి వివరాలు ప్రస్తావించలేదని కోర్టుకు విన్నవించారు. హెచ్‌పీసీఎల్ తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకున్నామని, రూ.70వేల జరిమానా విధించామని చెప్పారు. ఈ వివరణను ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది.రిటైలర్లతో ఇంధన కంపెనీలు కుమ్మక్కయినట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది.మోసాలకు పాల్పడుతున్న పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు నామమాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొంది. వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని స్పష్టం చేసింది. సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని హెచ్‌పీసీఎల్‌ను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

తిరుపతిరూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది.వర్సిటీ ప్రధానగేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు మాట్లాడుతూ.. వైద్య విద్య కోర్సుల తరహాలో వెటర్నరీ విద్య కూడా ఐదున్నరేళ్ల కాలవ్యవధితో నడుస్తుందని, అయితే వారికి నెలకు దాదాపు రూ.26 వేల స్టైఫండ్ అందిస్తూ తమపట్ల వివక్ష చూపుతున్నారని వాపోయారు. తమకు కూడా వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచేలా జీవో జారీ చేయాలని కోరారు.

దిగుమూర్తివారిపల్లిలో ఒంటరి ఏనుగు దాడులు

కల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్ద మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి దేవళంపేట పంచాయతీ పరిధిలోని కొమ్మిరెడ్డిగారిపల్లి (గెండ్లోళ్లపల్లి) వద్దకు ఒంటరి ఏనుగు చేరుకుంది. గ్రామంలోని రైతు ఉమాపతిపిళ్లైకు చెందిన వరి పంటను తొక్కేసింది. అక్కడే మరో రైతు కుమారస్వామినాయుడుకు చెందిన పనసచెట్టులోని కాయలను తినేసింది. అక్కడి నుంచి దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకోగానే గ్రామంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోని రైతు బాలాజికి చెందిన పనస, కొబ్బరి, బొప్పాయి పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. మరో రైతు నారాయణమ్మకు చెందిన కొబ్బరిచెట్టును కూకటివేళ్లతో పెకలించింది. అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని టపాకాయలు పేల్చి శబ్దాలు చేయడంతో ఒంటరి ఏనుగు అడవివైపు తిరుగుముఖం పట్టింది. సాయంత్రం ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, హరిప్రియ సిబ్బందితో సూరప్పచెరువు వద్దకు చేరుకొని ఒంటరి ఏనుగు జాడను గుర్తించేందుకు గాలింపు చేపట్టారు.



కొబ్బరిచెట్టును పెకలించిన ఒంటరి ఏనుగు

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో ముమ్మర తనిఖీలు

ఇప్పటి వరకు నలుగురు ఇన్విజిలేటర్ల తొలగింపు



కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యాధరి

చిత్తూరు సెంట్రల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో పలువురు ఉన్నతాధికారులు బుధవారం ముమ్మర తనిఖీలు చేశారు. ఐరాల మండలం కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకులు జ్యోతి కుమారి, ఎస్పీ మణికంఠతో కలిసి చిత్తూరు నగరం, జీడీ నెల్లూరులోని ఐదు పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. డీఆర్వో మోహన్ కుమార్ ఒకటి, డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరరావు చిత్తూరు, యాదమరి, జీడీ నెల్లూరులోని ఐదు కేంద్రాలను పరిశీలించారు. 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 55 కేంద్రాలను పరిశీలించగా, 41 పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించారు. సోమ, బుధవారాల్లో నిర్వహించిన పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఒకే డెస్క్‌లో ఇద్దరు విద్యార్థులను కూర్చోబెట్టడం వంటి కారణాలతో పూతలపట్టులోని ఇద్దర్ని, నగరిలో ఒకరు, నెల్లేపల్లి పరీక్షా కేంద్రంలో ఒకర్ని, మొత్తంగా నలుగురు ఇన్విజిలేటర్లను పరీక్ష విధుల నుంచి తొలగించినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. బుధవారం నిర్వహించిన హిందీ పరీక్షల్లో 20,609 మంది విద్యార్థులకు గాను 20,198 మంది హాజరు కాగా, 411 మంది గైర్హాజరైనట్లు డీఈవో చెప్పారు. జనరల్‌లో 20,581 మందికి గాను 20,188 మంది హాజరు కాగా, 393 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 28 మందికి గాను 10 మంది హాజరు కాగా, 18 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి తెలిపారు.

మహిళా సాధికారతే 'వెలుగు' లక్ష్యం

● కుప్పం మండల వెలుగు ఏపీఎం చంద్రశేఖర్



కుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే వెలుగు ప్రాజెక్టు లక్ష్యమని కుప్పం మండల ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌ల నిర్దేశకత్వంలో మండలంలోని మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పారు. రుణ లక్ష్యాలను ఇప్పటికే పరిపూర్తి చేసినట్లు వెల్లడించారు. క్లుప్తంగా ఏపీఎం చెప్పిన వెలుగు ప్రాజెక్టు విశేషాలివీ.

ఫటా ఫట్?

? ఎలక్ట్రిక్ సైకిళ్ల పంపిణీ

! కడా తరఫున కుప్పం నియోజకవర్గంలోని మహిళా సమాఖ్య సభ్యులు 300 మందికి పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ సైకిళ్లు పంపిణీ చేశాం. ఇందులో ఒక్క కుప్పం మండలానికే 50 సైకిళ్లు ఇచ్చాం. చిరు వ్యాపారులకు సరుకుల రవాణాకు అనువుగా ఉండే రూ.42 వేలు విలువ కలిగిన ఎలక్ట్రిక్ సైకిళ్లు కేవలం రూ.9 వేలకే పంపిణీ చేయడంతో పర్యావరణ హితంతోపాటు చిరు వ్యాపారులకు ఎంతో లాభాయకంగా వినియోగపడుతుడున్నాయి.

? మండలంలో మొత్తం 1,803 మహిళా సంఘాలు

! మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలో మొత్తం 1803 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు లక్ష్యంగా విధించిన రూ.54 కోట్ల రుణాలను ఇప్పటికే పూర్తిగా పంపిణీ చేశాం. ఈ రుణాలతో కిరాణా దుకాణాలు, టైలరింగ్, బేకరీలు, తినుబండారాల తయారీ, అగరబత్తుల తయారీ వంటి యూనిట్లను ఎక్కువగా మహిళలు నడుపుతూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

? శ్రీనిధి కింద రూ.6.54 కోట్లు రుణాల పంపిణీ

! మండల సమాఖ్య నుంచి శ్రీనిధి కింద మరో రూ.6.54 కోట్లను పంపిణీ చేశాం. ఈ రుణాలను పెట్టుబడిగా పెట్టి ఆవులు కొనుగోలు చేయడం, కూరగాయలు, పూలు, పండ్ల తోటల పెంపకం, ఇంకా వ్యవసాయాధారిత యూనిట్లను స్థాపించి మహిళలు ఆదాయం పొందుతున్నారు.

? డెయిరీతో ఉపాధి, ఆదాయం

! మండల సమాఖ్య నుంచి ఆవులు కొనుగోలు చేసిన మహిళల నుంచి వెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో పాలను సేకరిస్తున్నాం. మండల మహిళా సమాఖ్యతో శ్రీజ డెయిరీకి రోజుకు 8 వేల లీటర్లను కూలింగ్ చేసి సరఫరా చేస్తున్నాం. ఈ డెయిరీ యూనిట్‌తో అదనంగా మరో 8 వేల లీటర్ల పాల సేకరణ, సరఫరా చేస్తున్నాం. తద్వారా మండల సమాఖ్యకు శ్రీజ డెయిరీ నుంచి లీటరుకు 95 పైసలు కమిషన్ అందుతుంది. మండల సమాఖ్యకు నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు లాభాలు వస్తున్నాయి.

? ఈజీమార్టుతో పుంజుకున్న చిరువ్యాపారం

! కడా ద్వారా ఈజీమార్టు అనే ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ఒప్పందంతో చిరు వ్యాపారులైన మహిళలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసినా సరుకులు నేరుగా పల్లెల్లోని దుకాణాలకే ఆయా ఉత్పత్తి కంపెనీల నుంచి సరఫరా అవుతాయి. మధ్యలో దళారులు లేకపోవడంతో ఇటు వ్యాపారులకు మార్కెట్ రేటుకంటే తక్కువ ధర పడుతుంది. వీరు మళ్లీ వినియోగదారునికి ఎమ్మార్పీ కంటే తక్కువకు ఆ ఉత్పత్తిని అందించగల్గుతారు. తద్వారా వ్యాపారం పుంజుకుని లాభాలు గడించొచ్చు. ఇప్పటికీ జీమార్ట్ అమలు కోసం మండల పరిధిలో 116 కిరాణా దుకాణాలు గుర్తించాం. ఇందులో ప్రస్తుతం 22 దుకాణాలకు ఈజీమార్టుతో సరుకులు సరఫరా అవుతున్నాయి.

? వ్యాపారాభివృద్ధికి ఓఎన్‌డీసీ వరం

! మండల సమాఖ్యతో రుణాలు తీసుకుని వివిధ రకాలైన యూనిట్లు స్థాపించి వ్యాపారం చేస్తున్న, కిరాణా దుకాణాలు తదితరాలు స్థాపించిన మహిళలకు తోడ్పడేందుకు ఓపెన్ నెట్ యూజర్ అండ్ డిజిటల్ కన్స్యూమర్ (ఓఎన్‌డీసీ) లనే ఆన్‌లైన్ మార్కెటింగ్ యాప్‌ను కడా ద్వారా తీసుకొచ్చాం. ఈ యాప్‌ను ప్రతి ఆయా యూనిట్, కిరాణా దుకాణాలు నడుపుతున్న మహిళలు ముందుగా మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పలురకాల ఉత్పత్తులు ఇందులో ఆల్రెడీ ఉంటాయి. అలాగే మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ఇందులో ఉంచొచ్చు. వినియోగదారులు ఆర్డర్ చేసి ఉత్పత్తులను నేరుగా వారి దరికి చేర్చడానికి.. దుకాణాలకు కావాల్సి వస్తువులను ఆర్డర్ చేసి మార్కెట్ కంటే తక్కువ ధరకే తెప్పించుకోవడానికి ఓఎన్‌డీసీ ఎంతో ఉపయోగపడుతుంది. తద్వారా వ్యాపారాభివృద్ధి జరుగుతుంది.

పేదల ఆరోగ్యానికి రక్ష.. ముఖ్యమంత్రి సహాయ నిధి



వేలు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బువారం పేదవాడైన చిరు వ్యాపారుల సంఘం సభ్యుడు వేలు కుటుంబ సభ్యులకు రూ.6.40 లక్షలు విలువ కలిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా కల్పిస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్రశేఖర్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎం.మంజునాథ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలలో చాంపియన్ మణి



మణిని సత్కరిస్తున్న మహేష్ తదితరులు

కుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళూరుపేటలో జరిగిన బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ 75 కేజీల విభాగంలో కుప్పానికి చెందిన మణి చాంపియన్‌గా నిలిచారు. ఈ ఘనత సాధించిన మణిని బుధవారం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సలహాదారు ఎమహేష్ మాట్లాడుతూ ఎటువంటి శిక్షణ లేకుండా మూడేళ్లపాటు స్వయంగా కృషి చేసి చాంపియన్ షిప్ సాధించారని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, డైరెక్టర్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులకు సన్మానం



అర్చకులు రాజశేఖర్ దీక్షితులను సన్మానిస్తున్న వాసవి, వనితా క్లబ్ సభ్యులు

చౌడేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మృత్యుంజయే శ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులను స్థానిక వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక కన్యాకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆయన వేదపఠనంలో డాక్టరేట్ తీసుకున్నందుకు ఆయన్ను శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి శైలజ, కుటుంబ సభ్యులు కుమార దీక్షితులు, మహేష్ దీక్షితులు, క్లబ్ సభ్యులు నాగలక్ష్మి, రామ్మోహన్, కృష్ణమూర్తి, లోకేష్, శ్రీనాథ్, అమర, లోకి, రంగవల్లి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డుపైనే మాంసం విక్రయాలు



పలమనేరులో టి.ఎస్.అగ్రహారం వెళ్లే రహదారిపైనే మాంస విక్రయాలు చేస్తున్న వ్యాపారి

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో కొందరు మాంస వ్యాపారులు రోడ్లపైనే మాంస వ్యాపారాలు చేసుకుంటూ వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారు. పలమనేరులో దాదాపు వందకు పైగా చికెన్, మటన్ దుకాణాలు ఉన్నాయి. కొందరు అద్దె గదులు తీసుకోకుండా రోడ్లపైనే మాంసవిక్రయాలు చేస్తున్నారు. రోడ్డు పక్కనే బహిరంగ ప్రదేశంలో జంతువులను వధిస్తుండగా మరికొందరు షాపుల్లోనే జంతువధలు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో జంతువధశాల శిథిలం కావడంతో నేడు ఎక్కడ పడితే అక్కడ మాంస విక్రయాలు, జంతు వధలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు, గుడియాత్తం రహదారి, టి.ఎస్ అగ్రహారం వెళ్లే రహదారి, గొబ్బిళ్ల కోటూరు రహదారి సమీపంలో, మదనపల్లి రోడ్డుపక్కన మాంస విక్రయాలు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై, అపరిశుభ్ర ప్రాంతాల్లోనూ మాంస విక్రయాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న భూమిలో బోర్డు నాటుతున్న రెవెన్యూ అధికారులు

కుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నాయనూరు పరిధి సర్వే నెంబర్ 57లో తమిళనాడు వాసులు ఆక్రమించిన ఎకరా ప్రభుత్వ భూమిని బుధవారం తహసీల్దారు చిట్టిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఆక్రమితదారులు చదును చేసి ఈ భూమిని సర్వే చేసి, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు నాటారు.

జాబ్‌మేళాలో 34 మందికి ఉద్యోగావకాశాలు

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి కోసమే పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.వెంకటేసులు తెలిపారు. జాబ్‌మేళాలో పలు బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని, మొత్తం 54 మంది హాజరు కాగా.. 34 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్, హబ్ కోఆర్డినేటర్ సిసింద్రీ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఓ అనాథ శవానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. గంగవరం మండలం పత్తికొండ గ్రామం వద్ద ఈనెల 6న ఓ అనాథ వ్యక్తి అనారోగ్యంతో చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. అతను ఈనెల 12న మృతి చెందాడు. వారం రోజుల పాటు అతని మృతదేహం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. అతనికోసం ఎవరూ రాకపోవడంతో అతను ఓ అనాథ కావడంతో గంగవరం సీఐ సూచన మేరకు బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అనాథ శవాన్ని పలమనేరు పెద్ద శ్మశానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ శివ, శక్తిప్రసాద్, జిలాని, కుమార్‌రాజా, పృథ్వీ పాల్గొన్నారు.

రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌లో 17 మంది బదిలీ

రొంపిచెర్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ, మహిళా పోలీస్‌తో పాటు మరికొందరిని జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు బదిలీ చేసినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి చలపతినాయుడు, మధుసూదన్‌రెడ్డి, రాజేంద్రనాయుడు, నీలకృష్ణయ్యశెట్టి, సబ్బయ్య, చిట్టిబాబు, చిట్టెమ్మ, రెడ్డెప్పరెడ్డి, హనీఫ్‌బాషా, సురేష్‌కుమార్, వెంకటేశు, కార్తీక్, వేణు, పురుషోత్తం బదిలీపై వెళ్లారు. అలాగే ఇతర ప్రాంతాలలో పనిచేస్తున్న మనోహర్, శ్రీనివాసులు, నరసింహులు, ఏలుమలైరెడ్డి, రవి, మహేష్, రాజశేఖర్, మనోజ్‌కుమార్, కృష్ణమరాజు, జానకీరాం రొంపిచెర్లకు వస్తున్నట్లు తెలిపారు.

● సదుం: సదుం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ షేక్‌షావలి మినహా మిగిలిన మొత్తం 15 మంది సిబ్బంది బుధవారం బదిలీ అయ్యారు. పుంగనూరులో టీడీపీ నాయకులు హత్య, సదుంలో పుట్టావారిపల్లె నివాసి అనిల్‌పై దాడి సంఘటనల నేపథ్యంలో పుంగనూరు నియోజకవర్గంలో పోలీసు సిబ్బంది ప్రక్షాళనలో భాగంగా సదుం స్టేషన్‌లోనూ సిబ్బంది మొత్తాన్ని గుడిపాల, విజయపురం, బైరెడ్డిపల్లె, బంగారుపాళెం, చిత్తూరు తదితర సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు మహిళా కానిస్టేబుళ్లు, మరో ఐదుగురు కానిస్టేబుళ్లు ఉన్నారు. ఎస్ఐ సైతం బదిలీ కావొచ్చని తెలుస్తోంది.

21, 22 తేదీలలో కుప్పం నియోజకవర్గంలో సదరన్ క్యాంపులు

కుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే దివ్యాంగులు, వయోవృద్ధులకు అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడానికి ఈనెల 21, 22 వ తేదీలలో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో మెగా సదరన్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలకు ఈనెల 21న, కుప్పం రూరల్, మున్సిపాలిటీలకు 22వ తేఈన క్యాంపులు ఉంటాయన్నారు. దారిద్ర్య రేఖకు దిగువనున్నవారు, తెల్ల రేషన్ కార్డు, కుప్పం నియోజకవర్గానికి సంబంధించి ఆధార్ కార్డు కలిగి ఉన్నవారు సదరన్ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, 4 పాసుపోర్టు సైజ్ ఫోటోలు ఇదివరకే ఎవరైనా డాక్టర్ దగ్గర చికిత్స పొందిన రిపోర్టు ఒరిజినల్స్‌తోపాటు రెండు సెట్లు జిరాక్సు కాపీలు వెంట తీసుకు రావాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలు సదరన్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుస్థితిలో నెల్లిపట్ల రహదారి

● ముక్కుబడిగా రోడ్డుపై గుంతల పూడ్చివేత పనులు
● పట్టించుకోని అధికారులు





కొలమాసనపల్లి - నెల్లిపట్ల రహదారిలో గుంతలు , కొలమాసనపల్లి-నెల్లిపట్ల రహదారిలో ఇటీవల ముక్కుబడిగా చేసిన పనులు

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లగా గ్రామీణ రహదారులను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పలు గ్రామీణ రోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. దీంతో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం గ్రామీణ రహదారుల దుస్థితిని మార్చేందుకు తాత్కాలికంగా మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అయితే చాలాచోట్ల ఈ మరమ్మతులు చేయడంతో గ్రామీణ రహదారులు బాగుపడ్డాయి. అయితే కొన్ని రహదారుల్లో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు (ప్యాచ్‌వర్కు) మొక్కుబడిగా చేశారు. దీంతో ఈ రహదారులు అధికారుల నిర్లక్ష్యానికి, కాంట్రాక్టర్ల అక్రమాలకు అద్దం పడుతోంది. పలమనేరు మండలం కొలమాసనపల్లి నుంచి బైరెడ్డిపల్లి మండలంలోని అటవీ గ్రామం నెల్లిపట్ల వరకు సుమారు 10 కిలోమీటర్ల పొడవునా రహదారి ఉంది. ఈ రహదారిలోనే పక్షవాతానికి నాటుమందు ఇచ్చే విరూపాక్షపురం గ్రామం వస్తుంది. ఈ గ్రామంతో పాటు దాదాపు మరో 10కి పైగా గ్రామాలకు ఈ రహదారే మార్గం. రహదారిలో రోజూ వందలాది వాహనాల్లో పక్షవాత రోగులను విరూపాక్షపురానికి తీసుకొచ్చి మందు తీసుకొని వెళ్తంటారు. రహదారి గత ఐదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రహదారి పూర్తిగా దెబ్బతింది. రహదారి పొడవునా గుంతలు పడిఉండటంతో పాటు రహదారికి ఇరువైపులో వర్షాలకు కోతపడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అయితే ఈ రహదారి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే ఈ రహదారిలో ఉన్న గుంతలను సైతం పూర్తి స్థాయిలో పూడ్చకుండా మొక్కుబడిగా రహదారి మరమ్మతులు చేశారు. దీంతో రహదారి గతంలో మాదిరిగానే ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో ఏమాత్రం పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి మరమ్మతులు చేయించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా

● పలమనేరు మున్సిపల్ కమిషనర్ దాడులు
● ట్రాక్టరుతోపాటు ఎక్స్‌కవేటర్ స్వాధీనం



పలమనేరు కౌండిన్య నదిలో ఇసుక స్మగ్లర్లు పోగేసిన ఇసుక డంపులు



ఇసుక తరలిస్తున్న వారికి హెచ్చరికలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కౌండిన్యనదిలో ఇసుక అక్రమ రవానా ఇష్టారాజ్యంగా సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక స్మగ్లర్లు ఈ నదిపై ఉన్న చెక్‌డ్యాం వద్ద ఇసుకను విపరీతంగా తరలించడంతో చెక్‌డ్యాం కూలిపోయింది. అప్పట్లో పలు మార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు రాజకీయ ఒత్తిడితో ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం పలమనేరు మున్సిపల్ కమిషనర్ తమ సిబ్బందితో కౌండిన్య నది వద్ద మున్సిపాలిటీ తాగునీరు సరఫరా అయ్యే బోర్ల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా కౌండిన్య నదిలో భారీ డంపులను గుర్తించారు. అక్కడ ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో తీస్తుండగా.. వారిని మందలించారు. కమిషనర్‌కు దురుసుగా సమాధానాలు ఇవ్వడంతో స్థానిక పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి కౌండిన్య నదిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్స్‌కవేటర్‌తో పాటు ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. పలమనేరు ప్రజలకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన 9 బోర్లలో ఇప్పటికే 3 బోర్లు ఒట్టిపోయాయని, పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి తెలిపారు. నదిలో భూగర్భజలాలు పుష్కలంగా ఉన్నప్పటికీ ఇసుక తరలింపు కారణంగా భూగర్భజలాలు అడుగంటాయన్నారు. పలమనరులో ఇసుక స్మగ్లర్లపై మైనింగ్ అధికారులు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ సేవలు ప్రశంసనీయం



కంటి వైద్యశాలను ప్రారంభిస్తున్న కడ పీఓ వికాస్‌మర్మత్

రామకుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కడా పీవో వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం తెలిపారు. బుధవారం ఈ మీస్-స్విస్ రెఫరల్ ఆసుపత్రి చైర్మన్ జాకబ్‌తో కలిసి ఆలయ ఆవరణలో ఉచిత కంటి వైద్యశాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు కంటి సమస్యలు దూరం చేసుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కడా పీవో స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, నేతలు రామ్మూర్తి, సీతాపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేకే వైసీపీ దుష్ప్రచారం: గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే పరమావధిగా సాగుతున్న ప్రజారంజక పాలనతో ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసీపీ దుష్ప్రచారాలకు ఒడిగడుతోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందేలా ముఖ్యమంత్రి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని.. వైసీపీ నేతల మతి భ్రమిస్తోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, సీతాపతి, మహ్మద్‌రఫీ, కామరాజనాయక్, మనోహర్, నాగభూషణం, రామకృష్ణప్ప, రామలింగారెడ్డి, వెంకట్రామగౌడు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరీఫా

పుంగనూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా .. ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవన్నారు. భర్త వేధింపులకు గురి కాబడిన మహిళలు 498-ఎ యాక్ట్ కింద కోర్టులో దావా వేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, మహిళలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యం



పుంగనూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న తమను టీడీపీ కార్యకర్తలుగా భావించి విధుల నుంచి తొలగించారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. కార్యక్రమంలో మణికంఠ, గంగాధర్, రామ్‌మోహన్, సురేశ్, భాస్కర్, సురేశ్‌నాయక్, గోపి, రెడ్డిరాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు వారపుసంతకు వేలం

కల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట సచివాలయం ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు వారపు సంత, ప్రైవేటు బస్టాండు గేటు రుసుం వసూలు చేసుకొను హక్కుకు వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ముత్యాలమ్మకు కేజీబీవీ విద్యార్థుల పూజలు

రొంపిచెర్ల మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి బుధవారం కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు పరీక్షలకు వెళ్తూ పూజలు చేశారు. పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని కోరుకున్నారు.

నలగుండ్రాయస్వామికి పూజలు

బైరెడ్డిపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైన నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ తరగతులు

సోమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ హరిత తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

తహసీల్దారు బాబు సేవలు అభినందనీయం



తహసీల్దారు బాబును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల తహసీల్దారుగా బాబు సేవలు అభినందనీయమని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. బదిలీపై వెదురుకుప్పం వెళ్తున్న తహసీల్దారు బాబును బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, నందారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మనోహర్, రామలింగారెడ్డి, సత్తి, చంద్రారెడ్డి, భానుమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త హత్య బాధాకరం

చౌడేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త రామకృష్ణప్పను హత్య చేయడం చాలా బాధాకరమని బీజేపీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణ 5 సార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు చేసినా పోలీసులతో పాటు నాయకులు పట్టించు కోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గండోడి ప్రవిన్ కుమార్, రెడ్డప్ప పాల్గొన్నారు.

ఘనంగా మోహన్‌బాబు జన్మదిన వేడుకలు

చౌడేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హీరో మోహన్‌బాబు జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక గిరిజన కాలనీలో ఘనంగా నిర్వహించారు. గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుంగనూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లైబ్రరీకి రూ. 50 వేలు విలువ చేసే పుస్తకాలను దాతలు రాధమ్మ, నారాయణ వితరణ చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణానికి చెందిన జీఆర్. నారాయణ, రాధమ్మలు విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్‌కు సంబంధించిన 170 పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



వీఆర్వోలకు సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

ఐరాల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి వీఆర్వోలను హెచ్చరించారు. బుధవారం ఆమె ఐరాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, ప్రజావేదిక సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలను తయారుచేసి తహసీల్దార్‌కు సహకరించాలని ఆదేశించారు. అర్జీదారుడు అర్జీ అందించిన తేదీనే విచారణకు హాజరు కావాలన్నారు. అర్జీల పరిష్కారానికి సంబంధించి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా స్పందనలో వారడిగిన ప్రశ్నలకు అర్జీదారుల నుంచి వ్యతిరేకంగా సమాధానం వస్తే అధికారులపై కఠినచర్యలు తప్పవన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయండి

- ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి

ఐరాల(కాణిపాకం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): హడావుడి లేకుండా.. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆమె కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్ పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడితే చర్యలు తప్పవు

గుడిపాల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడినా, బైకు ర్యాలీ నిర్వహించినా వారిపై కఠిన చర్యలుంటాయని ఎస్ఐ రామ్మోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతమంది పరీక్షా కేంద్రాల వద్ద గుమికూడుతున్నారని సమాచారం రావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంఈవో హసన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం



బస్సును ఆపి వీరంగం సృష్టిస్తున్న మందుబాబు

చిత్తూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఆర్టీసీ డ్రైవర్‌పై వీరంగం సృష్టించాడు. బుధవారం ఓ వ్యక్తి మద్యం సేవించి ఎంఎస్ఆర్ సర్కిల్ వైపుగా జోయలుక్కాస్ సమీపంలో వస్తుండగా వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడు. మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి నడిరోడ్డుపైనే ద్విచక్ర వాహనాన్ని ఆపి ఆర్టీసీ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. దాంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రోడ్డుపైన వాహనదారులు సర్దిచెప్పడంతో మద్యం మత్తులోనే వాహనాన్ని తీసుకెళ్లిపోయాడు.

కంకర, మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు

వెదురుకుప్పం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మట్టి, కంకరను రవాణా చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కార్వేటినగరం తహసీల్దార్ కె.నాగరాజు హెచ్చరించారు. బుధవారం కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోల విధులకు ఆటంకం కల్పించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. భూకబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విధులను విస్మరిస్తే వీఆర్వోలపైన కూడా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.త్యాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గాదేవి వైద్యసేవలు ప్రశంసనీయం



డాక్టర్ దుర్గాదేవికి సన్మానం

గంగాధరనెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ పూరిమిట్ల దుర్గాదేవి నాలుగేళ్లపాటు రోగులకు అందించిన వైద్యసేవలు ప్రశంసనీయమని చిత్తూరుకు చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ రెండవ డాక్టర్ ప్రవీణ్, తిరుపతి చెర్లోపల్లెకు చెందిన మార్స్ సేవాసమితి అధ్యక్షుడు దళవాయి గుర్రప్ప నాయుడులు అన్నారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్‌గా పనిచేస్తున్న దుర్గాదేవి పీజీ కోర్సు నిమిత్తం చిత్తూరు అపోలో ఆస్పత్రికి వెళ్లనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆమెకు పలువురు వైద్యసిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేసి, శాలువలు కప్పి, గజమాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గుడిపాల, ఆరిమాకులపల్లె పీహెచ్‌సీ డాక్టర్‌లు చంద్రమహేష్, గౌరి, సీహెచ్‌వో శ్రీనివాసులు, మండల ఇండియన్‌రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు పాపిరెడ్డి, డీపీఎంవో క్రిష్ణన్, ధర్మేంద్ర, షైలా, నాగలక్ష్మి, షానవాజ్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గిరింపేట సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ ప్రసాద్, సిబ్బంది

చిత్తూరు రూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని సెక్షన్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం సాయంత్రం అమర్చినట్లు టౌన్ డీఈ ప్రసాద్ తెలిపారు. ఇక్కడున్న ఏళ్లనాటి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఇకపై ఈసెక్షన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఉండబోదని తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్ష



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగసౌజన్య

చిత్తూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రత కోసమే శక్తి యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్ అన్నారు. బుధవారం చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో శక్తి యాప్‌పై మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌ను ప్రతి ఒక్క మహిళా, విద్యార్థినులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలు.. వారున్న ప్రాంతానికి సమీపంలోని పోలీసుస్టేషన్‌కు సమాచారం వెళ్తుందన్నారు. వారు వెంటనే ఆపదలో ఉన్నవారిని రక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగసౌజన్య పాల్గొన్నారు.

తమిళనాడుకు తరలుతున్న ఇటుక ట్రాక్టర్ల స్వాధీనం

పాలసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇటుకల వ్యాపారంలో తమిళ్ తంబీల దందా అనే శీర్షిక ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రచురితమైంది. దీంతో తహసీల్దార్ అరుణకుమారి స్పందించి మండలంలోని దీనబంధుపురం నుంచి తమిళనాడుకు తరలిస్తున్న రెండు పచ్చి ఇటుక ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. తిరుమలరాజుపురం, నరసింహాపురం పంచాయతీలలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారికి పంచాయతీ కార్యదర్శులు హరి, జయశంకర్ నోటీసులు అందించారు. మండలంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఆముదాల ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాలసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాల ఫీల్డ్ అసిస్టెంట్ మునస్వామి ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రమేష్, ఏపీవో మార్గరేట్, ఈసీ రామమూర్తి, గ్రామస్థులు, ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను కలెక్టర్, డ్వామా పీడీకి అందజేస్తామని అధికారులు తెలిపారు.

సబ్సిడీపై మడక పంపిణీ

విజయపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురంలో రైతు చెన్నై రాయన్‌కు మండల వ్యవసాయాధికారి రజనీకుమారి 50శాతం సబ్సిడీపై మడక పంపిణీ చేశారు. మడక మొత్తం విలువ రూ.40,290 కాగా 50శాతం సబ్సిడీతో రూ.20,145లకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

తవణంపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని మండలంలోని పలువురు కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో రెడ్డిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలు, నిర్దేశిత కార్యక్రమాలు చేయడం వలన తీవ్ర ఒత్తిడికిలోనై అనారోగ్యంతో అకాల మరణానికి గురవుతున్నారని చెప్పారు. కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పని భారం తగ్గించాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రంజనీ, శ్రీనివాసులు, రామకృష్ణ, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

యాదమరి: తమకు పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీవో వేణుకు యాదమరి మండల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షురాలు దీప, ప్రధాన కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

తవణంపల్లె, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని గాజులపల్లెలో పర్యటించి డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డేగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మలేరియా అధికారి రామకృష్ణ, మండల వైద్యాధికారి వినయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో పీఈఎస్ విద్యార్థులకు బహుమతులు



ప్రశంసా పత్రాలతో కుశ్వంత్, సాత్విక, యశ్విత

యాదమరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇస్కాన్ ఆధ్వర్యంలో భగవద్గీతకు సంబంధించి జిల్లా స్థాయిలో వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్-2025 నిర్వహించారు. ఇందులో మండలంలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన 106 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో ఇ.సాత్విక (8వ తరగతి) తృతీయ బహుమతి, జె.కుశ్వంత్ (5వ తరగతి) నాలుగో బహుమతి, ఇ.యశ్విత (5వ తరగతి) కన్సొలేషన్ బహుమతిని గెలిచినట్లు ప్రిన్సిపాల్ కృష్ణబాబు తెలిపారు. ఈ కాంటెస్ట్‌కి సంబంధించి జిల్లాస్థాయిలో తమ పాఠశాల 5వ స్థానంలో నిలవడం హర్షించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఇఫ్తార్ విందు

చిత్తూరు కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్న మసీదులో బుధవారం సాయంత్రం రంజాన్ ఉపవాస ఇఫ్తార్ విందు ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం కుటుంబాలే కాకుండా, మతాల కతీతంగా పలువురు స్థానిక పెద్దలు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అష్రఫ్, మజార్, శ్యాం, మస్తాన్, కింగ్స్ షరీఫ్, అల్తాఫ్, అయాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే... అంతే సంగతులు...!

- రక్షణ గోడలు లేక ప్రమాదపుటంచున ప్రయాణాలు





రక్షణగోడ లేని కొత్తపల్లె సమీపంలోని వంతెన - మాధవనగర్ వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న రక్షణ గోడ

బంగారుపాళ్యం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరగొండ-గాజులపల్లె రహదారిలోని కొత్తపల్లె సమీపంలో ఉన్న బ్రిడ్జితో ప్రమాదం పొంచి ఉంది. ఈ ఇరుకైన కాలం చెల్లిన వంతెనకు ఎలాంటి రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదం జరిగితే పది అడుగుల లోతులో ఉండే వంకలో పడిపోవాల్సిందే. ప్రమాదం జరిగినా గుర్తించి వారిని పైకి తీసుకురావడం కూడా కష్టతరమే. రాత్రివేళల్లో వాహనచోదలకులకు ఈ వంతెన వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం ఈ రహదారి గుండా కాణిపాకం, అర్ధగిరి వంటి పుణ్యక్షేత్రాలకు భక్తులు వెళుతుండగా తుంబపాళ్యం, తుంబకుప్పం, సదకుప్పం,శెట్టేరి, నలంగాడు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే బెంగళూరు-చెన్నై రహదారిలో మాధవనగర్ సమీపంలో కాలం చెల్లిన బ్రిడ్జి రక్షణ గోడ కూడా పాక్షికంగా ఉంది. ఈ రహదారిలో బెంగళూరు, చెన్నైకి నిత్యం భారీ వాహనాలు, బస్సులు, ద్విచక్ర వాహనదారులు చిత్తూరుకు వెళుతుంటారు. ఈరక్షణ గోడను ఢీకొంటే ప్రమాదాన్ని నిలువరించడానికి అవకాశమే లేదు. ప్రమాదం జరిగితే 15 అడుగుల లోతులో పడిపోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వంతెనకు రక్షణ గోడను ఏర్పాటు చేయాల్సి ఉంది.

హోంగార్డుపై దౌర్జన్యం కేసులో ఇంకెందరో?

- ఇప్పటికే ఆరుగురిపై కేసు నమోదు
- 41 నోటీసు జారీకి పోలీసు యంత్రాంగం సన్నద్ధం



మహేష్(ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కొమరగుంట వాసి మహేష్(30) హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతదేహం మంగళవారం కొమరగుంటకు తరలిస్తుండగా జరిగిన పరిణామాల్లో కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కె.యువరాజ్‌పై ఆందోళనకారులు దౌర్జన్యానికి పాల్పడి, విధులను ఆటంకపరిచినట్లు మంగళవారం వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. హోంగార్డు యువరాజ్ వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చంద్రగిరి మండలం శానంబట్లకు చెందిన వంశీ సహా వెదురుకుప్పం మండలానికి చెందిన కోదండరెడ్డి, తేజ, లావణ్య, శకుంతల, వేణుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరికొందరు ఉన్నారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. పోలీసు కేసు నమోదైనట్లు బుధవారం ప్రచారం జరగడంతో ఈ కేసులో ఇంకెందరి పేర్లను పోలీసులు ఇరికిస్తారో తెలియడం లేదని పలువురు భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కేసులో నిందితులకు 41 నోటీసు ఇచ్చి కేసు దర్యాప్తు చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన జగదీష్ బుధవారం పెనుమూరులో మితిమీరిన వేగంతో కారు నడిపి ప్రమాదానికి కారకుడయ్యాడని పోలీసులు తెలిపారు. పెనుమూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి జగదీష్ వేగంగా కారు నడుపుతూ బస్టాండు వద్ద రోడ్డు పక్కన చిరువ్యాపారాలు నిర్వహించుకునే దుకాణాలపైకి పోనిచ్చాడు. దీంతో వెదురుకుప్పం మండలానికి చెందిన నాగరాజు, పెనుమూరుకు చెందిన పురుషోత్తం, తూర్పుపల్లికి చెందిన చిరంజీవి గాయాలపాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం పెనుమూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మధు తెలిపారు.

స్త్రీ జాతి ఆణిముత్యం సునీతా విలియమ్స్: టీడీపీ



మీడియా సమావేశంలో టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్త్రీ జాతి ఆణిముత్యం వ్యోమగామి సునీతా విలియమ్స్ అని టీడీపీ నేతలు కొనియాడారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ 9 నెలలు చంద్ర మండలంలో ఉండి సురక్షితంగా భూ మండలానికి వచ్చిన సునీతకు అభినందనలు తెలిపారు. భగవంతుడి పట్ల ఉన్న విశ్వాసమే ఆమెను కాపాడిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, గోపాల్, కందస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోండి



సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

బంగారుపాళ్యం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడుల్లో పంటలు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బోడబండ్ల గ్రామాన్ని సందర్శించి ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులు సురేష్, కృష్ణయ్య, సంజీవి, భాస్కర్, గోవింద్, ఈశ్వర్, శీను, లలిత, క్రిష్ణయ్య, మురళి, రవి, నాని, వెంకటేష్, హరి, మునీంద్ర, వెంటకప్ప, చంద్రయ్య, నాగభూషణం, సుధాకర్, సుబ్రమణ్యం, రామకృష్ణ, రాజేంద్ర, రవి, లోకనాథ మందడితో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడులు చేసి నష్టం కలిగిస్తున్నా అటవీ అధికారులు పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. అనంతరం బోడబండ్ల సచివాలయం ఎదుట సీపీఐ నాయకులు, రైతులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మణి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి చంద్ర, కౌన్సిల్ సభ్యులు కుమారి, రఘు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.20.93 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పెనుమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెనుమూరు బస్టాండు, షాపింగ్ కాంప్లెక్స్‌కు నిర్వహించిన వేలం ద్వారా పంచాయతీకి రూ.20.93లక్షల ఆదాయం సమకూరినట్లు డీఎల్పీవో పార్వతి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు పెనుమూరు సచివాలయం వద్ద బహిరంగవేలం నిర్వహించారు. మొత్తం 24 గదులకు ఒక్కొక్కరు రూ.50వేలు డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొన్నారు. అన్ని షాపులకు కలిపి ఏడాదికి రూ18.52 లక్షల ఆదాయం రాగా, వాటికి 3 శాతం స్టాంప్‌డ్యూటీ, ఒక శాతం ఐటీ, 9 శాతం జీఎస్టీ కలిపి మొత్తం ఏడాదికి వేలం ద్వారా 20.93లక్షలు వస్తుందని ఆమె తెలిపారు. వేలం పాటకు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటసుబ్బమ్మ, 20 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి ప్రభుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న డీఈ ప్రసాద్

చిత్తూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర కోరారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుతు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో 4అర్జీలు వచ్చాయని, త్వరగా విచారణ చేసి పరిష్కరించాలని తెలిపారు. డీఈ ప్రసాద్ అర్జీలు స్వీకరించారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణశ్రీ

పూతలపట్టు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధితో వ్యవసాయదారులు అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్లాంట్ పేథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణశ్రీ అన్నారు. మండలంలోని తిమ్మిరెడ్డిపల్లిలో బుధవారం మొక్కల తెగుళ్ల శాస్త్రీయ విధానంపై షెడ్యూల్ కులాల రైతులకు శిక్షణా తరగతులు జరిగాయి. ఆమె మాట్లాడుతూ విత్తనం ఎంపిక నుంచి పంటకోత వరకు చేపట్టవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, యాంత్రీకరణ, కలుపు నివారణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి మధురవాణి, నీలిమ, ప్రభావతి, రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుంభాభిషేక పూజలు



చిత్తూరు కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కట్టమంచి షిరిడీ విశ్వ సాయిబాబా ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం వేద పారాయణతో ఆరంభించి క్షేత్రపాలక, నవగ్రహ, అష్టోత్తర కలశ పూజలు, గణపతి, శతరుద్ర, జలక్షీరదాస్య, మూలమూర్తి హోమాలు, అష్టోత్తర, శత కలశ స్థాపన పూజలు, దిక్పాలిక ఆవాహన పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు పాల్గొని భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కుంభాభిషేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం షిరిడీ విశ్వసాయి బాబా ఆలయ మహా కుంభాభిషేకం జరుగుతుంది.

ఘనంగా మాస మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం మాస మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భగవాన్ సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో బాలింతలకు, శిశువులకు స్వామి వారి ప్రసాదంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, గజేంద్ర రెడ్డి, గణేశ్, దేవరాజులు, రుక్మిణి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచిని దూషించిన వారిపై కేసు

వెదురుకుప్పం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట గ్రామ సర్పంచ్ దివ్యను దూషించిన ఘటనపై కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో ఇద్దరిపై బుధవారం కేసు నమోదైంది. ఆర్కేవీబీపేట గ్రామ సమీపంలో అక్రమ కట్టడం ఆర్చి తొలగింపు విషయమై ఈ నెల 15వ తేదీ సాయంత్రం అక్కడికి చేరుకున్న సర్పంచ్ దివ్యపట్ల అదే గ్రామానికి చెందిన ఎం.జగదీష్, ఎస్.సతీష్ దురుసుగా వ్యవహరించారు. ఈ విషయమై సర్పంచ్ దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

దొరస్వామిరాజు కుటుంబానికి పరామర్శ

వెదురుకుప్పం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట పంచాయతీ రాజులకండ్రిగ గ్రామానికి చెందిన దొరస్వామిరాజు కుటుంబీకులను బుధవారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. దొరస్వామి రాజు ఇటీవల మరణించారు. వైసీపీ మండల అధ్యక్షుడు శేఖర్ రాజు, చందురాజు, పురుషోత్తంరాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

టీచర్ల బదిలీల చట్టానికి అసెంబ్లీ ఆమోదం హర్షణీయం: ఆపస్

చిత్తూరు సెంట్రల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బదిలీలపై అసెంబ్లీలో చట్టం చేసి ఆమోదించడం పట్ల ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బదిలీలకు కోడ్ రూపొందించడం కోసం ప్రతి వారం విద్యాశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, సూచనల మేరకు, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల సూచనల మేరకు టీచర్ల బదిలీల చట్టం డ్రాఫ్ట్ రూపొందించి, కేబినెట్‌లో ఆమోదం పొందడం హర్షణీయమన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోనశశిధర్, విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన అమ్ములు (ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూలి పని కోసం ఇంటి నుంచి టౌన్‌కు వెళ్లిన తన భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మల్లిఖార్జున వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లె పంచాయతీలోని ఏనుగుంట్లపల్లె ఆదిఆంధ్రవాడలో మునిరత్నం, భార్య అమ్ములు(38) నివాసముంటున్నారు. వివాహ సమయాల్లో కల్యాణ మండపాల్లో శుభ్రం చేసే పనులకు అమ్ములు వెళుతుండేది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన పని కోసం టౌన్‌కు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ కనపడలేదు. దీంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.